# వైయస్ఆర్ కాంగ్రెస్
e-paper

కూర్పు: వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

11 జనవరి, బుధవారం 2017 - హైదరాబాద్

సంపుటి: 1 సంచిక: 701 పేజీలు : 3


# జనంలో ఒక్కడు



- బాధల్లో తోడుంటూ..భరోసానిచ్చిన వైయస్ జగన్
- కర్నూలు జిల్లాలో ముగిసిన మొదటి విడత రైతు భరోసా యాత్ర
- ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు అండగా నిలిచిన వైయస్ఆర్‌సీపీ అధినేత
- వృద్ధులు, వికలాంగుల కష్టాల్లో పాలు పంచుకున్న జననేత
- పొలాల్లోకి వెళ్లి రైతుల ఇబ్బందులు తెలుసుకున్న ప్రతిపక్ష నేత
- మల్లన్న దర్శనం, చర్చి, దర్గాల్లో ప్రార్థనలు
- శ్రీశైలం నియోజకవర్గంలో ఆరు రోజుల పాటు పర్యటించిన వైయస్ జగన్
- ఊరూరా అపూర్వ స్వాగతం.. ఆప్యాయత పంచిన ప్రజలు

హైదరాబాద్: రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయ్యింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేర్చలేదు. బ్యాంకుల్లో బంగారం ఇంటికి రావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. రైతుల పంట రుణాలు బేషరత్తుగా మాఫీ చేస్తామని నాడు హామీ ఇచ్చారు. తీరా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రుణాలు మాఫీ చేయలేదు. దీనికితోడు వరుసగా మూడేళ్లు కరువే..కరువు. పంటలు పండక.. చేసిన అప్పులు తీర్చే దారి లేక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇలాంటి సమయంలో నేనున్నానని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఏపీ ప్రతిపక్ష నేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా యాత్రకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే అనంతపురం జిల్లాలో రైతు భరోసా యాత్రను ఐదు విడతల్లో పూర్తి చేసిన వైయస్ జగన్..ఈ ఏడాది జనవరి 5వ తేదీ నుంచి కర్నూలు జిల్లాలో చేపట్టిన మొదటి విడత రైతు భరోసా యాత్ర మంగళవారంతో ముగిసింది. జిల్లాలోని శ్రీశైలం నియోజకవర్గంలో ఆరు రోజుల పాటు పర్యటించిన ఆయన ప్రజలతో మమేకమయ్యారు. ఇంతవరకు ఆ స్థాయి నాయకుడు ఇంతగా ఒకే నియోజకవర్గంలో వారం రోజుల పాటు పర్యటించి అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావడం బహుశా దేశ చరిత్రలో ఇదేనేమో. రైతు భరోసా యాత్రకు వచ్చిన జననేత వైయస్ జగన్‌కు గ్రామ గ్రామాన అనూహ్య స్పందన లభించింది. కుటుంబ సభ్యుల్లో ఒకరిగా ఆదరించిన తీరు.. వృద్ధులు, వికలాంగులు, రైతులు, కూలీలకు జీవితంపై భరోసా కల్పించగా.. అక్కాచెల్లెమ్మలను ఆశీర్వదిస్తూ.. యువతకు దిశానిర్దేశం చేశారు. పల్లెల్లో పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తూ స్వాగతం పలకడం ఆయనకున్న జనాదరణకు అద్దం పట్టింది. మొత్తం పర్యటనలో మండుటెండలో.. రాత్రి పొద్దుపోయాక కూడా ప్రజలు బారులు తీరి స్వాగతించడం విశేషం.

## కన్నీళ్లు తుడుస్తూ..కష్టాల్లో తోడుగా

మూడేళ్ల చంద్రబాబు పాలనలో విసిగిపోయిన ప్రజలకు అండగా నిలిచేందుకు వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి జనం వద్దకు కదిలాడు. అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు ధైర్యం చెప్పేందుకు కర్నూలు జిల్లాలో రైతు భరోసా యాత్ర చేపట్టారు. శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబ సభ్యుల కన్నీళ్లు తుడుస్తూ..వారి కష్టాల్లో తోడుగా నిలిచారు. అధైర్యపడొద్దు..అండగా ఉంటానని భరోసా కల్పించారు.

## యాత్ర సాగింది ఇలా..

ఈ నెల 5వ తేదీ నుంచి కర్నూలు జిల్లాలో రైతు భరోసా యాత్ర చేపట్టిన వైయస్ జగన్ ఏకధాటిగా ఆరు రోజుల పాటు ఒక్క శ్రీశైలం నియోజకవర్గంలోనే పర్యటించారు. శ్రీశైలం ప్రాజెక్టు పరిశీలనతో మొదలైన యాత్ర సున్నిపెంటలో రోడ్‌షోతో ముందుకు కదిలింది. 2015వ సంవత్సరంలో తెలుగు దేశం పార్టీ నేతల దాడిలో దారుణంగా హత్యకు గురైన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వసంతరావు కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. జనవరి 6న శ్రీశైల మల్లికార్జున స్వామిని వైయస్ జగన్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ప్రకాశం జిల్లా మీదుగా దోర్నాల చేరుకొని మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగించారు. నల్లమల అరణ్యంలో పర్యటించి చెంచులతో

2లో

# జనంలో ఒక్కడు





## మొదటిపేజీ తరువాయి

మాట్లాడారు. అనంతరం ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం, కృష్ణాపురం, అమలాపురం మీదుగా రోడ్‌షో నిర్వహించారు. సాయంత్రం ఆత్మకూరు పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో చంద్రబాబు పాలన తీరుపై నిప్పులు చెరిగారు. అనంతరం పట్టణంలోని ఇందిరానగర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, అక్కడికి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించారు. ఓదార్పు యాత్ర సందర్భంగా కరివేన గ్రామంలో వైయస్ఆర్ అభిమానులు ఏర్పాటు చేసుకున్న మహానేత విగ్రహాలను ఆవిష్కరించడం సాధ్యపడకపోవడంతో అక్కడికి వైయస్ జగన్ వెళ్లి మూడు విగ్రహాలను ఆవిష్కరించారు. అదే రోజు రాత్రి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి స్మృతివనాన్ని సందర్శించి మహానేతకు నివాళులర్పించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జనవరి 7న వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామం నుంచి మూడో రోజు యాత్రను ప్రారంభించిన వైయస్ జగన్ ముందుగా గ్రామంలోని అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. మార్గమధ్యలో కేసీ కెనాల్ పరిశీలించారు. వెలుగోడు పట్టణంలోని వైయస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం బోయరేవుల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు చాకలి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మోతుకూరు గ్రామంలో వరి రైతులతో మాట్లాడారు. జనవరి 8న వేల్పనూరు నుంచి నాలుగో రోజు యాత్ర ప్రారంభించిన వైయస్ జగన్ చిన్న దేవలాపురం, సంతజూటురు మీదుగా లింగాపురం గ్రామానికి చేరుకొని అక్కడ మహానేత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ తరువాత జీసీ పాలెం, సింగవరం, కడమలకాల్వలో రోడ్‌షో నిర్వహించారు. ఐదో రోజు లింగాపురం గ్రామంలోని చర్చిలో ప్రార్థనల అనంతరం యాత్రను ప్రారంభించిన వైయస్ జగన్ బండి ఆత్మకూరు మండలంలో పర్యటించారు. ఓంకార క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడే ఉన్న చెంచులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వెంగళరెడ్డిపేటలో మహానేత వైయస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బి.కోడురు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు చాంద్‌బాషా కుటుబాన్ని పరామర్శించారు. అదే రోజు రాత్రి మహానంది మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు చిన్నస్వామి కుటుంబాన్ని ఓదార్చారు. ఆరో రోజు మహానంది మండలం నుంచి యాత్ర ప్రారంభించిన వైయస్ జగన్ మహానందీశ్వరాలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం పసుపు రైతులతో మాట్లాడి పంట సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. చివరిగా గాజులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రతిపక్ష నేత మాట్లాడారు.

### బ్రహ్మరథం

వైయస్ జగన్ మోహన్ రెడ్డి రైతు భరోసా యాత్రలో భాగంగా ఏ గ్రామం వెళ్లినా జనం బ్రహ్మరథం పట్టారు. జననేతను చూసి తమ బాధలు చెప్పుకున్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో మోసపోయామని ప్రజలు ప్రతిపక్ష నేత వద్ద వాపోతున్నారు. ప్రతి గ్రామంలోనూ జగన్ కు ఘన స్వాగతం పలుకుతూ..పూలవర్షం కురిపించారు. పర్యటనలో భాగంగా వైయస్ జగన్ పొలం గట్ల వెంట నడుస్తూ..రైతులు, కూలీలను పలకరిస్తూ..పంట సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు తెలుసుకుంటున్నారు. జనంతో మాట్లాడుతూ..వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ..చిన్నారులను చెంతకు తీసుకొని లాలిస్తూ..యువతతో సెల్ఫీలు దిగుతూ ఇలా రోజంతా జనంలోనే వైయస్ జగన్ గడిపారు.

### చలించిన ప్రతిపక్ష నేత

కర్నూలు జిల్లాలో పర్యటించిన వైయస్ జగన్ ఆయా మండలాల్లో పంటల దుస్థితిని చూసి చలించిపోయారు. వరి, కంది, మినుము, మొక్కజొన్న, పసుపు పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చెమ్మగిల్లిన కళ్లతో రైతులు మాట్లాడుతూ పంట సరిగా రాలేదని, తెగుళ్లతో పాటు గిట్టుబాటు ధర లేకపోవడంతో కనీసం కౌలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. రైతుల బాధలు తెలుసుకున్న వైయస్ జగన్ వారిని ఓదారుస్తూ మన ప్రభుత్వంలో రైతుల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని భరోసానిచ్చారు. నడిచేందుకు వీలు కాని వృద్ధులు కూడా అతి కష్టం మీద కర్రల సహాయంతో ఎదురొచ్చి జననేతను పలుకరించారు. వికలాంగులు కూడా ఆయనను కలిసి తమ కష్టాలను చెప్పుకున్నారు. జననేతతో కరచాలనానికి యువత పోటీపడ్డారు. ఇప్పట్లో ఎన్నికలు లేకపోయినా జనం కష్టాలు తెలుసుకునేందుకు వచ్చిన వైయస్ జగన్‌కు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఆయన కూడా జనంలో ఒక్కడిగా మెలిగారు. ఇలాంటి నాయకుడు యుగానికి ఒక్కరు పుడతారని, వైయస్ జగన్ జనంలో ఒక్కడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. నాయకుడంటే ఇలా ఉండాలని వైయస్ఆర్‌సీపీ నేతలు కాలర్ ఎగురవేస్తున్నారు. దటీజ్ వైయస్ జగన్.

# బాబు జీవితమంతా అంతే

- మహానేత ప్రాజెక్టులు కడితే.. తాను కట్టినట్టు బాబు బిల్డప్
- ఎన్నికల్లో సొంతంగా గెలిచే సత్తా లేక పక్క పార్టీ ఎమ్మెల్యేలను లాక్కున్నారు
- తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క ప్రాజెక్టు నిర్మించని బాబు
- పోతిరెడ్డిపాడుకు అడ్డుపడిన దేవినేని నీతులు మాట్లాడుతున్నారు
- ప్రాజెక్ట్‌లపై శ్వేతపత్రం విడుదల చేయండి
- వైయస్ఆర్‌సీపీ ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డిని అడ్డుకోవడం అప్రజాస్వామికం
- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

హైదరాబాద్: ఏపీ సీఎం చంద్రబాబు జీవితమంతా పక్కవారిపై ఆధారపడటమే తప్పా..సొంతంగా ఏది చేయలేరని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఇతరులకు రావాల్సిన క్రెడిట్‌ను తాను తీసుకునేందుకు, తన పార్టీ నేతలతో పొగిడించుకునేందుకు మీటింగ్‌లు పెట్టుకుంటూ..అభివృద్ధి కార్యక్రమాలలో ప్రతిపక్ష పార్టీ



ప్రజాప్రతినిధులను హాజరు కాకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. వైయస్ఆర్ జిల్లా కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి గృహ నిర్బంధం, పోలీసులు అడ్డుపడటాన్ని శ్రీకాంత్‌రెడ్డి తప్పుపట్టారు. ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని, ఇరిగేషన్ ప్రాజెక్టుల చర్చకు సిద్ధమా అంటూ సర్కార్‌కు ఆయన సవాల్ విసిరారు. చంద్రబాబు హయాంలో ఎన్ని ప్రాజెక్టులు కట్టారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నిజంగా తానే ప్రాజెక్టులు కట్టానని అనుకుంటే ప్రతిపక్షం గొంతు నొక్కడం ఎందుకని శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పూర్తి చేసిన ప్రాజెక్టులను తాను కట్టానని చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనా కాలంలో రాయలసీమ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు.పైడిపాలెం రిజర్వాయర్ ప్రారంభం నేపథ్యంలో కడప ఎంపీ అవినాష్ రెడ్డిని గృహ నిర్భంధం చేయడాన్ని శ్రీకాంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ప్రోటోకాల్‌ను విస్మరించడం ప్రజాస్వామ్య దేశంలో మంచి పద్ధతి కాదన్నారు. రాయలసీమలోని ప్రాజెక్టులన్నీ తానే కట్టానని చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు అనంతపురం జిల్లాలో ఓడి చెరువుకు శంకుస్థాపన చేశారని, ఆ ప్రాజెక్టుకు చంద్రబాబు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. 1995వ సంవత్సరంలో అనంతపురం జిల్లాలోనే హంద్రీనీవా ప్రాజెక్టుకు 45 టీఎంసీల సామర్థ్యంలో నిర్మిస్తామని శంకుస్థాపన చేశారన్నారు. 1999 ఎన్నికల సమయంలో అదే ప్రాజెక్టుకు అనంతపురం జిల్లా ఆత్మకూరు వద్ద 5 టీఎంసీకు సామర్థ్యాన్ని కుదిస్తూ మరో శంకుస్థాపన చేశారని తెలిపారు. 1999 నుంచి 2004వ సంవత్సరం వరకు ఆ ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారన్నారు.

### వాస్తవాలు మాట్లాడుతున్నాం

ప్రాజెక్టులపై తాము రాజకీయ కోణంలో మాట్లాడటం లేదని, వాస్తవాలు మాట్లాడుతున్నామని గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక బాబు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకు రూ.3800 కోట్లు కేటాయించారన్నారు. వైయస్ఆర్ హయాంలో 90 శాతం పూర్తయిన ప్రాజెక్టులకు చంద్రబాబు 5 శాతం అరకొరగా చేపట్టి, వాటిని తానే కట్టినట్లు ఫోజులు కొడుతున్నారని విమర్శించారు. బాబు తన సొంత మనుషులకు కాంట్రాక్టులు అప్పగించేందుకు ప్రాజెక్టు అంచనాలు పెంచారని ఆరోపించారు. నాడు రాయలసీమకు నీళ్లు ఇచ్చేందుకు మహానేత పోతిరెడ్డిపాడు విస్తరణ పనులు చేపడితే మంత్రి దేవినేని ఉమా అప్పట్లో పాదయాత్ర చేసి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. ఇలాంటి వ్యక్తి ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైయస్ఆర్ ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశారు, ఎన్ని నిధులు కేటాయించారో అన్న విషయంపై టీడీపీ నేతలకు దమ్మూ, ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు రావాలని శ్రీకాంత్‌రెడ్డి సవాల్ విసిరారు. పులివెందులకు నీళ్లు ఇచ్చేందుకు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి కృషి చేశారని, దానికి రూ.24 కోట్లు కేటాయించి అంతా తానే చేసినట్లు చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు.గత తొమ్మిదేళ్ల పాలనలో బాబుకు పైడిపాలెం ప్రాజెక్టు ఎందుకు గుర్తు రాలేదని ఆయన నిలదీశారు. పక్క తోటలోని పండ్లు తనవే అన్నట్లు, పక్కపార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి తన పార్టీలో చేర్చుకోవడం, మహానేత కట్టించిన ప్రాజెక్టులు తానే కట్టించినట్లు ప్రచారం చేసుకోవడం చంద్రబాబుకే సాధ్యమని శ్రీకాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

# పైడిపాలెం రిజర్వాయర్ వైయస్ఆర్ స్వప్నం

## ● ముందస్తు అరెస్టులు అన్యాయం ● ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి

కడప: వైయస్ఆర్ జిల్లాలోని పైడిపాలెం రిజర్వాయర్ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి స్వప్నమని కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మహానేత హయాంలో 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టును తానే కట్టించానని చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. వైయస్ఆర్ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా వైయస్ అవినాష్ రెడ్డిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పులివెందుల వైయస్ఆర్ సీపీ కార్యాలయంలో ఆయనను నిర్భంధించారు. పైడిపాలెం రిజర్వాయర్ వద్దకు వెళుతున్నఅవినాష్ రెడ్డి, మాజీమంత్రి వైయస్ వివేకానందరెడ్డి తదితర నేతలను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం సీఎం కార్యక్రమంలో పాల్గొనేందుకు తమకు ఆహ్వానం ఉందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి నిర్భందాలు మంచిది కాదని హితవు పలికారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పైడిపాలెం జలాశయానికి వైయస్ రాజశేఖరరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. తమను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పైడిపాలెం రిజర్వాయర్‌ను వైయస్ రాజశేఖరరెడ్డి 90 శాతం పనులు పూర్తి చేశారని, అయితే చంద్రబాబు ఇప్పుడు అన్ని తానే పూర్తి చేశానని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. తనను నిర్భంధించడం ప్రతిపక్షాల గొంతు నొక్కడమే అని, జన్మభూమిలో సమస్యలు చెప్పుకోవాలంటున్నారని, మరి సమస్యలు చెప్పడానికి వస్తే అరెస్ట్ చేయడం న్యాయమా అని అవినాష్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలు మానుకోకపోతే ప్రజలు తిరుగబడతారని అవినాష్‌రెడ్డి హెచ్చరించారు.

### వైయస్ఆర్ కల సాకారం

పైడిపాలెం రిజర్వాయర్ ప్రారంభోత్సవంతో దివంతగ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి కల సాకారం అయిందని కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి అన్నారు. పైడిపాలెంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైయస్ఆర్ హయాంలోనే ప్రాజెక్టులకు రూపకల్పన జరిగిందని, ఆయన హయాంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. పైడిపాలెం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అలాగే ఎస్సీ ఎస్టీ కాలనీలలో కరెంటు బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతోందని, వెంటనే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా వారి కరెంటు బిల్లులు చెల్లించి, ఆయా కాలనీలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. 2012-2013వ సంవత్సరంలో దెబ్బతిన్న శనగ పంటకు ఇంతవరకు పరిహారం అందలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సభలో మహానేత పేరు వినపడగానే పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వినిపించాయి.



ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డిని ఇంటిని ముట్టడించి ఆయన్ను బయటకు రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

# వైయస్ జగన్ సీఎం కావాలని పాదయాత్ర

తిరుమల: వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ పాదయాత్ర చేపట్టారు. వైయస్ఆర్ జిల్లా రైల్వేకోడూరు నియోజవర్గం ఓబులవారిపల్లె మండలానికి చెందిన 800 మంది చేపట్టిన పాదయాత్ర తిరుమల చేరుకుంది. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ జయపాల్‌రెడ్డి నేతృత్వంలో వీరు గోవిందమాల ధరించారు. సోమవారం ఉదయం 5 గంటలకు పాదయాత్ర ప్రారంభించి అన్నమయ్య కాలిబాట మీదుగా మంగళవారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. దాదాపు అందరూ శ్రీవారికి తలనీలాలు సమర్పించి దర్శనానికి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ..చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు విస్మరించారన్నారు. రైతుల గురించే ఆలోచించే నాథుడు లేడన్నారు. వైయస్ జగన్ సీఎం అయితేనే దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి నాటి పాలన మళ్లీ వస్తుందన్నారు. ఇందుకోసం తాము పాదయాత్రగా వచ్చి తిరుమలలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు పార్టీ నాయకుడు జయపాల్‌రెడ్డి తెలిపారు.



పాదయాత్రతో తిరుమలకు చేరుకున్న రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలానికి చెందిన 800 మంది

# టీడీపీ నేతలు వైయస్ఆర్‌సీపీలో చేరిక

అనంతపురం: జిల్లాలో అధికార పార్టీ నేతలు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామంలో బుధవారం గడప గడపకూ వైయస్ఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీకి చెందిన 50 మంది యూత్ నాయకులు, కార్యకర్తలు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..2019లో వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.



వైయస్ఆర్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

## e మాట




/ysrcofficial @ysjagan @YSRCParty /ysrcpofficial www.ysrcongress.com

**జననేత మాట:** దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి పాలనలో ఒక్క మన రాష్ట్రంలోనే 48 లక్షల ఇళ్లు కట్టించి పేదలకు తోడుగా నిలబడ్డారు.